మేరు కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వండి: పోల్కం శ్రీనివాస్



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను గజమాలతో సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు కార్పొరేషన్ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని మేరు యువజన సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చైర్మన్ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..మేరు కులస్తులకు గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. 20 లక్షలకు పైగా ఉన్న మేరు కులస్తులంతా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించారన్నారు. మేరు యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల్కం వినయ్‌రాజ్, రాష్ట్ర నాయకులు ఆదిమూలం శంకర్, వెన్ను శివకుమార్ మాట్లాడుతూ.. 30 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో క్రమ శిక్షణగల నాయకుడిగా ఉంటున్న పోల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ పదవి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి మేరు కులస్తుల సమస్యలను, పోల్కం శ్రీనివాస్ విషయాన్ని తీసుకువెళ్లి తగు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

మజ్లిస్ చొరవతో అభివృద్ధి పనులు



చేతి పంపు పనులను పరిశీలిస్తున్న నాగరాజు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ డివిజన్‌లోని ఆలయాల వద్ద బోనాల పండుగ పనులు శరవేగంగా జరుగుతుండడంపై మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు వర్కల నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న నూతన చేతి పంపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, ఉప్పుగూడ కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాద్ చొరవతో ఆలయాల వద్ద రోడ్ల మరమ్మతులు, విద్యుత్ పనులు కొనసాగుతున్నాయన్నారు. అన్ని ఆలయాల వద్ద త్వరలోనే పనులు పూర్తి కానున్నాయని, ప్రజలంతా బోనాల పండుగను సుఖ శాంతులతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, వేణు, భాను, సాయి తదితరులు పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు

గోల్కొండ: ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు నిర్వహిస్తున్న మార్గదర్శన్ పథకం వల్ల ఇంజినీరింగ్ కళాశాలల్లో పని చేస్తున్న ఫ్యాకల్టీలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయని షేక్‌పేట్‌లోని జీ.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి అన్నారు. ఏఐసీటీఈ మార్గదర్శన్ కార్యక్రమంలో భాగంగా జీఎన్ఐటీఎస్‌లో జరిగిన ఆరు రోజుల సదస్సు సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి మార్గదర్శన్ కార్యక్రమం వల్ల ఉన్న ప్రయోజనాలను వివరించారు. సాంకేతిక కళాశాలల్లో నైపుణ్యాలను పెంచేందుకు మార్గదర్శనం కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఔట్ కమ్ బెస్ట్ ఎడ్యుకేషన్ విధానంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆరు ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపక బృందాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ ఆర్‌అండ్‌డీ హెడ్ డాక్టర్ ఎం.సీత, డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ విశ్వనాథరాజు, జేఎన్‌టీయూహెచ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి వేలాదిగా భక్తులు తరలివచ్చి దర్శించుకుంటున్నారు. సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి తొట్టెల సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో నగీనాబాగ్, మహంకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో మహంకాళి ఆలయ పూజారి సురేష్‌చారి పూజలు నిర్వహించారు.



అమర్‌నాథ్ యాత్రకు అవసరమైన దుస్తుల ప్రదర్శన



చార్మినార్: అమర్‌నాథ్ యాత్రకు అవసరమైన దుస్తుల ఏర్పాటుతో కూడిన ప్రత్యేక ఎగ్జిబిషన్ మదీనాలోని మహ్మద్ క్యాప్ మార్ట్‌లో కొనసాగుతోంది. రాష్ట్రం నుంచి అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం అక్కడి వాతావరణాన్ని తట్టుకునే విధంగా ప్రత్యేకంగా తయారు చేయించిన దుస్తులతో కూడిన ఎగ్జిబిషన్‌ను అందుబాటులోకి తెచ్చామని మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ తెలిపారు. లెదర్ జాకెట్స్, రెయిన్ కోట్స్, వింటర్ క్యాప్, హ్యాండ్ గ్లౌజ్, ఉలెన్ సాక్స్, ట్రావెల్ బ్యాగ్, గొడుగు, రెయిన్ క్యాప్ తదితర అన్ని రకాల వస్తువులు ఒకే చోట లభించేటట్లు ఏర్పాటు చేశామన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న ఉస్మాన్ అలీ, వినోద్ చాగ్లే

జియాగూడ: జియాగూడలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్ అలీ, జియాగూడ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినోద్ చాగ్లే తెలిపారు. సోమవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ శశిరేఖను ప్రజావాణి కార్యక్రమంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..జాతీయ రహదారిలో ఉన్న చెత్త డంపింగ్ యార్డులో సకాలంలో చెత్తను తరలించకపోవడంతో చెత్త పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. అలాగే డంపింగ్‌యార్డు పరిసరాల రహదారుల్లో ట్రక్కుల ద్వారా కూడా చెత్త కింద పడుతుందని సకాలంలో తరలించడం లేదని పేర్కొన్నారు. స్పందించిన డిప్యూటీ కమిషనర్ శశిరేఖ వెంటనే సంబంధిత విభాగానికి ఫోన్‌లో తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పి.దర్శన్, సహ కార్యదర్శి మహేష్ బాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



రిసాలబజార్‌లో..

గోల్కొండ: మొహర్రం సందర్భంగా ఆషూర్‌ఖానాల వద్ద సాయంత్రం కాగానే సందడి నెలకొంటుంది. గోల్కొండ రిసాలబజార్, మాసాబ్‌ట్యాంక్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని ఆషూర్‌ఖానాలలో కొలువుదీరి ఉన్న ఆలంలను భక్తులు దర్శించుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో ఆలంలకు దట్టీలు సమర్పిస్తున్నారు. గోల్కొండ కోట సమీపంలోని చారిత్రక ఆషూర్‌ఖానాలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి షియాముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. మగవారు, స్త్రీలు నల్లటి వస్త్రాలు ధరించి ఆషూర్‌ఖానాలో మజాలిస్ నిర్వహిస్తున్నారు.

సన్మానం

చార్మినార్: పాతబస్తీకి చెందిన విజయ్ 30 ఏళ్లుగా పోతరాజుగా అమ్మవారికి సేవలు కొనసాగిస్తూ భక్తుల మన్నలు పొందుతున్నారని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. 30 ఏళ్ల పూర్తి చేసుకుని ఈసారి జరుగుతున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో 31వ వార్షికోత్సవ పోతరాజుగా సేవలు కొనసాగించడం ఆయనకు అమ్మవారిపై ఉన్న భక్తిశ్రద్ధలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా విజయ్ పోతరాజును కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ సన్మానించారు.




విజయ్ పోతరాజును సన్మానిస్తున్న కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్

దర్వాజ నుంచి దర్జాగా..

- పాతబస్తీ నుంచి కోటకు బోనాలు
- వయా దర్వాజ మాతేశ్వరీ గుండానే..



పురానాపూల్ దర్వాజ



దర్వాజ మాతేశ్వరీ

జియాగూడ: ఆషాఢ మాసంలో పాతబస్తీ నుంచి ప్రతిరోజూ గోల్కొండకు వెళ్లే వివిధ ప్రాంతాల బోనాలు పురానాపూల్ దర్వాజ మాతేశ్వరీ ఆలయాన్ని దర్శించుకున్నాకే తిరిగి గోల్కొండ కోటకు వెళ్లడం ఆనవాయితీ. పురానాపూల్‌లోని దర్వాజ మాతేశ్వరీ బోనాల ఉత్సవాలు ఈనెల 28, 29 తేదీలలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పురానాపూల్ దర్వాజ గోల్కొండ కోటకు వెళ్లే ప్రధాన రహదారుల్లో ఒకటి, గోల్కొండ కోట మీదుగా పాతబస్తీకి రాకపోకలు సాగించే మొదటి దర్వాజ ఇదే. ఈ దర్వాజ 1904లో వచ్చిన మూసీ వరదల్లో మునిగినా ఏ మాత్రం చెక్కు చెదరలేదు. పురానాపూల్ దర్వాజలో మాతేశ్వరీ కొలువుదీరి ఉందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దర్వాజ 400 ఏళ్ల క్రితం నిర్మించినది కావడంతో కొంత మేరకు శిథిలావస్థకు చేరుకుంది.

శివాజీ చేతుల మీదుగా ప్రతిష్ఠాపన..

గోల్కొండ కోట పైకి దండెత్తిన ఛత్రపతి శివాజీ మహరాజ్ పురానాపూల్ దర్వాజ నుంచే కోటకు వస్తున్నారనే సమాచారం అందుకున్న గోల్కొండ పాలకులు దర్వాజను మూసివేయించారు. ఎంతకు దర్వాజ తెరుచుకోకపోవడంతో శివాజీ మహరాజ్ ఇక్కడే కూర్చొని ధ్యానం చేసి మాతేశ్వరీని అనుమతి కోరారు. దీంతో దర్వాజలు తెరుచుకున్నాయి. వెంటనే శివాజీ మహరాజ్ దర్వాజ మాతేశ్వరీని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించి గోల్కొండ కోటకు వెళ్లారు. నాటి నుంచి మాతేశ్వరీ భక్తుల నుంచి ప్రతిరోజు పూజలందుకుంటుంది. ఇక్కడే కాళికాదేవి ఆలయం ఉండడం మరో విశేషం. శివాజీ జయంతి వేడుకలు, విజయోత్సవ వేడుకలు ఇక్కడి నుంచే ఊరేగింపుగా ప్రారంభమై గౌలిగూడ వంతెన వద్ద ఉన్న శివాజీ విగ్రహం వద్దకు చేరుకుంటుంది.

భారీగా బోనాల ఏర్పాటు..

ప్రతి ఏటా పాతబస్తీ నుంచి కార్వాన్, జియాగూడ సబ్జీమండి ప్రాంతాల మీదుగా ఊరేగింపుగా వెళ్లే తొట్టెలను ఇక్కడకు తీసుకువచ్చి మాతేశ్వరీ దర్శనం చేసిన తర్వాతే గోల్కొండ కోటకు వెళ్తుంటారు. అలాగే దసరా నవరాత్రి వేడుకలు కూడా తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించడంతో పాటు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

'మహాత్మా బసవేశ్వరుడు అభ్యుదయ వాది'



చార్మినార్: సమాజంలోని ప్రజలందరూ సమానమేనని ఎలుగెత్తి చాటిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని టీఎస్ బసన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి కొనియాడారు. బసవేశ్వర విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కులాలకు వ్యతిరేకంగా పోరాడుతూ అన్ని వర్గాల ప్రజలు సమానమేనని నిర్మొహమాటంగా చెప్పిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరుడన్నారు.

నేడు సామూహిక కుంకుమార్చన

యాకుత్‌పురా: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా హరిబౌలి గజానన వ్యాయామశాలలోని మాతేశ్వరి పోచమ్మ, మహంకాళి ఆలయంలో మంగళవారం సాముహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటలక నిర్వహించే ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరాని కోరారు. అనంతరం భక్తులకు అమ్మవారికి సమర్పించిన ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు



శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పట్ట పగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. డివిజన్‌లోని ఖాజీపురా, హిమ్మత్‌పురా, ఆశా టాకీస్ తదితర ప్రాంతాల్లో పట్ట పగలే వీధి దీపాలు వెలుగుతున్నా వీధి దీపాల నిర్వహణను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులకు గురవుతుంటే.. ఉన్న ప్రాంతాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతుండటంతో ప్రజాధనం దుర్వినియోగానికి గురవుతుందని ప్రజలు వాపోతున్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా వీధి దీపాల నిర్వాహణను పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూసెన్స్ కేసులో ఇద్దరికి జైలు

సంతోష్‌నగర్: ఆటో స్టాండ్, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేస్తున్న ఇద్దరికి నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ సోమవారం రెండు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి, ఎస్సై లింగరాజు తెలిపిన వివరాల ప్రకారం..కంచన్‌బాగ్ పిసల్‌బండ మదినా గుడిసెలు ప్రాంతానికి చెందిన ముదావత్ రమేశ్ (29), రియాసత్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ ఖయ్యూం (42)లు స్టేషన్ పరిధిలోని ఆటో స్టాండ్, బహిరంగ ప్రదేశాల్లో పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై ఈ–పెట్టీ కేసు నమోదు చేసుకొని సోమవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ సత్యనారాయణ ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వ్యాపారులు సమయపాలన పాటించాలి



వ్యాపారులతో సమావేశమైన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్

గౌలిపురా: వ్యాపారులు పోలీసుల నిబంధనలను తప్పకుండా పాటించాలని మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ సూచించారు. మొఘల్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలోని పాన్ షాపులు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులతో సోమవారం ఆయన స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పోలీసుల నిబంధనలకు విరుద్ధంగా సమయ పాలన పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవన్నారు. పాన్ షాపులు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు సమయ పాలనను తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సీహెచ్. నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

దూద్‌బౌలి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనిట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. పాతబస్తీ చేలాపురాలోని ట్రైనింగ్ విద్యార్థినులకు ఆయన సోమవారం ట్రాఫిక్ నిబంధనలు–రోడ్డు సేఫ్టీపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే రూ.5 వేల జరిమానాతో పాటు 3 నెలల పాటు జైలు శిక్ష కూడా విధించివచ్చునన్నారు. మైనర్లు ఎట్టిపరిస్థితుల్లో వాహనాలను నడుపరాదని..వారు పట్టుపబడితే వాహనాల యజమానులకు సైతం జైలు శిక్షలు పడతాయన్నారు. ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ఏసీపీ అచ్యుతరావు, ఆర్ ఎస్సై దేవేందర్‌రెడ్డి, జి.శరవాణి తదితరులు పాల్గొన్నారు.

హరళయ్య సమ్‌గర్ సమాజ్ అభ్యున్నతికి కృషి



నూతన చైర్మన్ కిషన్‌ధామను సన్మానిస్తున్న సమాజ్ ప్రతినిధులు

జియాగూడ: హరళయ్య సమ్‌గర్ సమాజ్ అభ్యున్నతికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన జియాగూడ సంజయ్‌నగర్ శ్రీ హరళయ్య సమ్‌గర్ సమాజ్ చైర్మన్ కిషన్‌ధామ అన్నారు. సోమవారం సంజయ్‌నగర్‌లోని హరళయ్య భవన్‌లో సమాజ్ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ సమ్‌గర్ సమాజ్ చైర్మన్ రోహిదాస్ వాగ్మారే, అధ్యక్షుడు జితేందర్, ప్రధాన కార్యదర్శి మున్నాలాల్ కోక, సహ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు ఆయనను సత్కరించారు. సంజయనగర్ హరళయ్య సమ్‌గర్ సమాజ్ వైస్ చైర్మన్‌గా విఠల్‌రావు టీలేకర్, అధ్యక్షుడిగా సంజయ్ కామ్లే, ఉపాధ్యక్షులుగా రితేష్ ధామ, రాంచందర్ టీలేకర్, ప్రధాన కార్యదర్శిగా రవి టీలేకర్, కోశాధికారిగా మోహన్‌ధామ, సహ కోశాధికారిగా అరుణ్ ధామ, సహ కార్యదర్శులుగా బందాస్ కామ్లే, కొండిబా కాంబ్లే, సతయ్యనారాయణ సూర్యవంశి, మోహన్ సోన్ కాంబ్లే, రాజ్‌కుమార్, హమీల్‌పూర్ ఎన్నికయ్యారు.

గుండెపోటుతో ఆలె నాగేశ్ మృతి



నివాళులర్పిస్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

గౌలిపురా: కేంద్ర మాజీ మంత్రి టైగర్ ఆలె నరేంద్ర సోదరుడు ఆలె నాగేశ్ ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మరణ వార్త తెలుసుకున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి ఆయన నివాసానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం చాంద్రాయణగుట్ట నల్లవాగులోని హిందూ శ్మశాన వాటికలో సోమవారం సాయంత్రం అంత్యక్రియలను నిర్వహించారు. ఆలె శ్యామ్‌జీ, ఆలె భాస్కర్‌రాజ్, ఆలె జితేంద్ర, ఆలె భాగ్యలక్ష్మి, సురేందర్ రెడ్డి, బీజేపీ నాయకులు సుమన్ కుమార్ ముదిరాజ్, జ్యోతి కుమార్, జమాల్‌పూర్ అశోక్, మోకాళ్ల వెంకటేష్, గౌలీకర్ ధీరజ్ లాల్, జమాల్‌పూర్ చంద్రశేఖర్, ఆదర్శ మహేశ్, కొడి సురేందర్, ప్రేమ్, సాయికిశోర్, ఉదయ్ కిరణ్‌రెడ్డి, సొక్కెల్లి సర్వేశ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

- బజార్‌ఘాట్ ఆషూర్‌ఖానాలో పూర్తికాని అభివృద్ధి పనులు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు



హజరతే అబ్బాస్ ఆషూర్‌ఖానాలో ప్రతిష్ఠించిన పీర్లు



తవ్వేసిన ఫ్లోరింగ్

నాంపల్లి: మొహర్రంను పురస్కరించుకుని బజార్‌ఘాట్‌లోని హజరతే అబ్బాస్ ఆషూర్‌ఖానాలో పీర్లను ప్రతిష్ఠించారు. ఎంతో చారిత్రాత్మక నేపథ్యం కలిగిన ఆషూర్‌ఖానాలో ప్రతి ఏటా వైభవోపేతంగా మొహర్రం వేడుకలు జరుగుతుంటాయి. ఈ వేడుకలు ముత్తవల్లీ సయ్యద్ ఫసీవుద్దీన్ పర్యవేక్షణలో నిర్వహిస్తారు. ఈనెల 7న ప్రతిష్ఠించిన పీర్లకు దట్టీలతో పాటుగా పూలను అలకంరించి నిత్యారాధన చేస్తుంటారు. ఈ పూజలు 17వ తేదీతో ముగుస్తాయి. మొహర్రం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకుంటారు. కులాలు, మతాలకు అతీతంగా పీర్ల ఊరేగింపును ఊరేగిస్తారు. అయితే జీహెచ్ఎంసీ పండుగ ఏర్పాట్లను చేయడంలో పూర్తిగా విఫలమైందని ముత్తవల్లీ సయ్యద్ ఫసీవుద్దీన్ ఆరోపించారు. ఆషూర్‌ఖానాలో ఉన్న ఫ్లోరింగ్ పనులు పూర్తిగా నిలిచిపోయాయని వాపోయారు. ప్రభుత్వం నిధులను మంజూరు చేసినా, ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఆదేశాలించినా ఇప్పటి వరకు ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆషూర్‌ఖానాలో బాగున్న ఫ్లోరింగ్‌ను ఎత్తిపోశారని, వాటి స్థానంలో కొత్తగా అభివృద్ధి పనులేమి జరుగులేదన్నారు. ఫలితంగా పీర్ల ఊరేగింపునకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. పీర్లను ప్రతిష్ఠించి ఎనిమిది రోజులు పూర్తయినా ఇప్పటి వరకు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వక్ఫ్‌బోర్డు అధికారులు సైతం పండుగకు ముందే ఏర్పాట్లు పూర్తి చేస్తామని చెప్పినా, ఇప్పటి వరకు ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదని మండిపడ్డారు.

రేపు సాలార్‌జంగ్ మ్యూజియం బంద్

చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకుని పాతబస్తీ ప్రధాన వీధుల్లో నిర్వహించే సామూహిక ఊరేగింపు సందర్భంగా ఈ నెల 17న సాలార్‌జంగ్ మ్యూజియంకు సెలవు ఉంటుందని అధికారులు తెలిపారు. డబీర్‌పురా బీబీకాఅలావా నుంచి చార్మినార్ ద్వారా అంబారిపై బీబీకాఆలం సామూహిక ఊరేగింపు నిర్వహిస్తున్నందున సందర్శన నిలిపి వేస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు.

సీఎంను కలిసిన మెట్టు సాయికుమార్



అబిడ్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కుటుంబ సమేతంగా కలిసి సన్మానించారు. చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల మత్స్యకార పక్షపాత్రి రేవంత్‌రెడ్డి అని ఆయన అన్నారు. క్రమశిక్షణ గల కార్యకర్తలకు ముఖ్యమంత్రి తగు ప్రోత్సాహం కలిప్తున్నారని పేర్కొన్నారు. మత్స్యకార చేప మెమొంటోను ముఖ్యమంత్రికి అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యశాఖ అభివృద్ధికి, సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో విశేషంగా కృషి చేస్తానని మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు.

పోటీ తత్వంతోనే సాహిత్య వికాసం



పురస్కార ప్రదానోత్సవంలో ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ చెన్నయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: రచయితల్లో పోటీ తత్వం వల్ల సాహిత్య వికాసానికి మేలు జరుగుతుందని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. 2024 సంవత్సరానికి సారస్వత పరిషత్తు వివిధ సాహిత్య ప్రక్రియల్లో నిర్వహించిన పోటీలో న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ గ్రంథాలకు సోమవారం పరిషత్తులోని దేవులపల్లి రామారావు కళామందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్యతో కలిసి పురస్కారాలు ప్రదానం చేశారు. పురస్కారాలు పొందిన గ్రంథాల ప్రమాణాలు చూస్తుంటే తెలంగాణ సృజనాత్మక ప్రతిభ ఉన్నత స్థాయిలో ఉన్నట్లు తెలుస్తుందని శివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ శ్రీ రంగాచార్య, జింబో(మంగారి రాజేందర్), బి.మురళీధర్‌కు పురస్కారాలు ప్రదానం చేశారు. రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

బోనాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి



వేడుకల్లో బీజేపీ నాయకుడు సోమరాజ్ సింగ్ తదితరులు

అబిడ్స్: బోనాలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వేగవంతంగా ఏర్పాట్లు చేపట్టాలని గోషామహల్ బీజేవైఎం ఇన్‌చార్జి సోమరాజ్ సింగ్ పేర్కొన్నారు. అన్ని ఆలయాల పరిసరాల్లో రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులు వేగంగా చేయాలన్నారు. గంగాబౌలిలలో జరిగిన బోనాల వేడుకల్లో ఆయన పూజలు నిర్వహించి ప్రసంగించారు. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా వాటర్‌బోర్డు, జీహెచ్ఎంసీ, విద్యుత్, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపాదికన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌సింగ్, శంకర్ సింగ్ జమేదార్ తదితరులు పాల్గొన్నారు.

బీబీకా అలావాను సందర్శించిన ఈటల



అలావాను సందర్శించిన ఈటల రాజేందర్

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా డబీర్‌పురాలోని బీబీకా అలావాను సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలంలకు పూలు, దట్టీలను ఆయన సమర్పించారు. ఆయన రాక సందర్భంగా అలావా ముతవల్లీ ఘనంగా స్వాగతం పలికారు. ఈటల రాజేందర్‌తో పాటు బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, హిదాయత్ అలీ మీర్జా, దియానాథ్ అలీ ఖాన్‌లు పాల్గొన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ షబ్బీర్ అలీ సైతం పాల్గొని ఆలంలకు పూలు, దట్టీలను సమర్పించారు.

పేద మహిళలకు అండగా మజ్లిస్ పార్టీ

గోల్కొండ: పేద మహిళలకు మజ్లిస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం కార్వాన్, గోల్కొండ డివిజన్ల మహిళలు మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వారు దరఖాస్తు చేసుకున్న షాదీముబారక్‌కు ఇంకా మంజూరు లభించలేదని జబీన్ అనే మహిళ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసింది. గోల్కొండలో ఎంజీపీ డైరీ ఫామ్ నుంచి మోతీ దర్వాజ వరకు సంవత్సర కాలంలో రోడ్డు అధ్వానంగా ఉందని ఎండీలైన్స్‌కు చెందిన మరో మహిళ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎమ్మెల్యే పెండింగ్‌లో దరఖాస్తులను మంజూరు లభించేలా కృషి చేస్తానన్నారు. బస్తీలను వరద ముంపు ప్రమాదం నుంచి తప్పించేందుకు పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు.